సాక్షి ఖమ్మం

శనివారం । 23 । మార్చి । 2024



నీడ.. గ్రీన్ ఎనర్జీ

భద్రాచలంలో గోదావరి కరకట్టపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేస్తే విద్యుత్ ఉత్పత్తితో పాటు పర్యాటకులకు నీడ లభించే అవకాశముంది. 8లో




ఎన్నేళ్లు ఔట్‌సోర్సింగ్ కష్టాలు?

ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా కనీస వేతనం అందని తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 23°

జిల్లాలో శనివారం ఉదయం కాస్త చల్లగా ఉంటుంది. ఆతర్వాత ఎండల మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.



న్యూస్‌రీల్

పెద్దాస్పత్రిని సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శుక్రవారం ఇద్దరు అసిస్టెంట్ కలెక్టర్లు సందర్శించారు. శిక్షణలో భాగంగా మయాంక్ సింగ్, యువరాజ్ ఆస్పత్రికి రాగా, ఓపీ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, క్యాజువాలిటీలను పరిశీలించి వైద్య సేవల వివరాలు సేకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ బి.అమర్‌సింగ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్న పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ సూచించారు. జిల్లాలోని 379పాఠశాలల హెచ్ఎంలతో ఆయన శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించే సమయాన అమ్మ ఆదర్శ కమిటీల సమావేశం నిర్వహించి ఆయా పనులకు అయ్యే ఖర్చుపై తీర్మానం చేయాలని సూచించారు. రూ.25వేల లోపు నిధులు చేపట్టే పనులను ఇంజనీర్ ద్వారా రికార్డు చేయాలని, రూ.లక్ష దాటే పనుల ప్రతిపాదనలకు కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. ఈసమావేశంలో రామకృష్ణ, జీ.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్స్ ఆధ్వర్యాన ఆన్‌లైన్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న సీఐ అంజలి, షీ టీమ్స్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: మహిళలను వేధిస్తున్న పలువురిపై కేసులు నమోదుకాగా, హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ విధానంలో షీ టీమ్స్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి పలువురిని హాజరుపర్చగా, హైదరాబాద్ నుంచి సైకాలజిస్ట్ డాక్టర్ గీతా చల్లా మాట్లాడారు. సమాజంలో మహిళలను గౌరవించాలనే భావనలో అందరిలో రావాలని, ఈ మార్పు కోసమే కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఇంకో మహిళను వేధింటప్పుడు తమ కుటుంబంలోని మహిళలు కూడా వేధింపులకు గురవుతారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. అలాగే, తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నుండి సీఐ అంజలి, షీ టీమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేఎంసీలో అకౌంట్స్ అధికారికి స్థానచలనం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ అకౌంట్స్ విభాగంలోని అకౌంట్స్ అధికారిని రెవెన్యూ విభాగంలో ఆర్ఐగా మారుస్తూ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. సదరు అధికారి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులతో 'చెక్కులు సరే.. నాకేంటి?' శీర్షికన 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందించిన కమిషనర్ విచారణ చేపట్టారు. దీంతో రెండు రోజుల క్రితం ఆయనను రెవెన్యూ విభాగానికి కేటాయించినా ఉత్తర్వులు స్వీకరించకుండా అకౌంట్స్ విభాగంలోనే కొనసాగుతున్నారు. సదరు అధికారి పాత సీట్‌లోనే కొనసాగేలా ప్రయత్నాలు చేస్తుండగా, అది సాధ్యం కాకపోతే మాతృశాఖ అయిన ఖజానా శాఖకు తిరిగి వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

సాక్షి ఎఫెక్ట్..



కంపచెట్లతో నిండిపోయిన జమలాపురం మేజర్ కెనాల్

పంట పండినట్లే..

మండలాల వారీగా ఇలా...

- ఎర్రుపాలెం మండలం సాగర్ కెనాల్ జోన్-3 పరిధిలో ఉండగా, కాల్వ 40 కి.మీ. విస్తరించి ఉంది. ఈ మండలంలోని 15,716 ఎకరాలకు మైలవరం బ్రాంచ్ కెనాల్, జమలాపురం మేజర్ కాల్వల ద్వారా నీరు సరఫరా కావాలి. కానీ మైలవరం బ్రాంచ్ కెనాల్ ద్వారా ఎర్రుపాలెం మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీరు రావాలంటే ఏపీలో 27 కి.మీ. సరఫరా జరిగాక తెలంగాణకు చేరుతుంది. తెలంగాణ భూములు ఎగువన, ఆంధ్రా భూములు దిగువన ఉండడమే ఇందుకు కారణం. ఫలితంగా ఎర్రుపాలెం మండలంలోని సాగర్ ఆయకట్టుకు నీరు అందక బీడుగా ఉంటున్నాయి. ఇక జమలాపురం మేజర్ కెనాల్ కింద 19 కి.మీ. మేర ఆయకట్టు ఉండగా... ఈ కాల్వకు నీరు సరఫరా కావాలంటే ఆంధ్రాలో 33.8 కి.మీ. ప్రవహించాల్సి ఉంటుంది. నాలుగేళ్లకు ఓసారి కూడా చివరి ఆయకట్టు భూమి వరకు సాగర్ నీరు సరఫరా కాలేదు. ఏళ్లుగా జమలాపురం మేజర్, మైలవరం బ్రాంచ్ కెనాళ్లలో నీరు విడుదల కాకపోవడంతో కాల్వలు కంపచెట్లతో నిండిపోయాయి.
- మధిర మండల పరిధిలోని నిధానపురం మేజర్ కెనాల్ ద్వారా 13,219 ఎకరాల ఆయకట్టుకు సాగర్ నీరు విడుదల కావాలి. సాగర్ కెనాల్‌కు నిధానపురం మేజర్ చివరి కెనాల్ కావడంతో ఆయకట్టు భూములకు అందడం లేదు. దీంతో మెట్టపంటలు సాగుచేసిన రైతులకు నష్టాలే ఎదురవుతున్నాయి. నిధానపురం మేజర్ కెనాల్ పూడిక పేరుకుపోయి, కంపచెట్లు అల్లుకుపోయి కాల్వలు కూడా కనిపించే పరిస్థితి లేదు.



నీరు లేక ఎండిపోయిన సాగర్ కాల్వ

- రెండు మండలాల సాగర్ ఆయకట్టు జోన్ మార్పు
- తాజాగా నిర్ణయించిన ప్రభుత్వం
- ఆనకట్టలు, పంప్ హౌస్‌ల నిర్మాణంతో కాల్వలకు ఎత్తిపోత
- మధిర, ఎర్రుపాలెంలో 33 వేల ఎకరాలు సస్యశ్యామలం!
- రూ.793.70 కోట్ల ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదనలు

మధిర: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో చివరి ఆయకట్టుకు నీరు అందక పంటల సాగుపై ఆశలు వదిలేసుకున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగర్ నుంచి నీరు విడుదల చేసినప్పుడు నేరుగా ఇక్కడకు రాకుండా ఏపీకి వెళ్లి అక్కడి నుంచి వస్తుండడంతో చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయి భారీగా నష్టపోయిన సందర్భాలున్నాయి. ఈనేపథ్యాన ఆయకట్టును జోన్-3 నుంచి జోన్-2లోకి మారుస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో సాఫీగా నీరు అంది రెండు మండలాల్లో 33వేల ఎకరాల భూములు సస్యశ్యామలం కానుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

చివరి భూములు...

మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని ఆయకట్టు సాగర్ కాల్వకు చివరి భూములుగా ఉండడంతో సక్రమంగా నీరు అందడం లేదు. ఈ ప్రాంత రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న, పెసర, కంది తదితర పంటలు సాగు చేసేవారు. నీటి విడుదలలో లోపాలు, ఎగువ భూములు కావడంతో సాఫీగా ప్రవహించక రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేసేదేం లేక కొందరు రైతులు సుబాబుల్ సాగు చేసినా దానికీ గిట్టుబాటు లేక నష్టం ఎదురైంది. ఇంకొందరు ఏ పంట సాగు చేయకుండా బీళ్లుగా వదిలేశారు. ఈక్రమంలో రెండు మండలాల రైతుల ఆవేదనను పరిశీలిస్తున్న మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ఈ ప్రాంతాన్ని సాగర్ జోన్-3 నుంచి జోన్-2లోకి మార్పించేందుకు ప్రయత్నాలు చేశారు. ఇటీవల ఎన్నికల్లో ఆయన గెలవడం, డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా ఇటీవల మధిరకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోన్ మార్పుపై ప్రకటన చేయడమే కాక ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



పూర్తిగా కనుమరుగైన నిదానపురం మేజర్ కెనాల్

ఇప్పుడేం చేస్తారంటే...

జోన్ – 3 కింద ఉన్న మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని ఆయకట్టు భూములను జోన్ – 2 కిందకు తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. సాగర్ నుంచి వైరా నదికి నీరందించేలా చేపట్టాల్సిన పనులకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయి. దీంతో వంగవీడు సమీపంలో వైరా నదిపై ఆనకట్ట నిర్మించి నదికి ఎడమ పక్కన పంప్ హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి నిదానపురం మేజర్ కెనాల్ 38.20 కిలోమీటర్ వద్ద ఉన్న కాల్వలోకి వైరా నదికి చేరే సాగర్ నీటిని ఎత్తిపోస్తారు. అలాగే, ఎర్రుపాలెం మండలంలోని అయ్యవారిగూడెం వద్ద కట్టలేరు నదిపై ఆనకట్ట, పంప్ హౌస్ నిర్మిస్తారు. ఆతర్వాత మైలవరం బ్రాంచ్, జమలాపురం మేజర్ కెనాల్‌కు నీరు ఎత్తిపోస్తారు. వంగవీడు వద్ద వైరా నదిపై నిర్మించే పంప్ హౌస్ నుంచి ప్రతిరోజు 300 క్యూసెక్కులు ఎత్తిపోయనుండగా, ఖరీఫ్‌లో పంటలకు 120 రోజులకు సరిపడా నీరు అందుతుందని చెబుతున్నారు. ఆయా పనులకు రూ.793.70 కోట్ల నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనల్లో పొందుపర్చారు.

మా కష్టాలు తీరతాయి...



జమలాపురం మేజర్ కింద ఉన్న మా భూములకు సాగర్ నీరు అందక ఏటా నష్టపోతున్నాం. కొందరు సుబాబుల్ సాగు చేయగా, ఇంకొందరు భూములు వదిలేశారు. జోన్-3 నుంచి జోన్-2లోకి మార్పు చేస్తే మా భూములు సస్యశ్యామలం అవుతాయి. మంచి పంటలు పండి మా కష్టాలు తీరుతాయి.

– శీలం వెంకట్రామిరెడ్డి, రైతు నరసింహాపురం

భట్టికి రుణపడి ఉంటాం..



మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సాగర్ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కొన్నేళ్లుగా చేస్తున్న ప్రయత్నం ఇప్పుడు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. మా భూములకు నీరు అందితే భట్టికి రైతులంతా రుణపడి ఉంటారు.

– లావు వెంకటేశ్వరరావు, రైతు, నరసింహపురం

వాణిజ్య పంటలు సాగు చేస్తాం



రైతులను ఆదుకునేందుకు భట్టి విక్రమార్క చేస్తున్న కృషి మరువలేనిది. మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలో వైరా, కట్టలేరు నదులు ఉన్నాయి. వీటిపై ఆనకట్టలు నిర్మించి పంప్ హౌస్‌ల ఏర్పాటుతో సాగర్ కాల్వలోకి నీరు వదిలితే సుబాబుల్ వంటి పంటలను తొలగించి వాణిజ్య పంటలు సాగు చేస్తాం.

–అమరవాది సత్యనారాయణరెడ్డి, రైతు, నిదానపురం

మంత్రి తుమ్మల వాహనం తనిఖీ



మంత్రి వాహనంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మధిర: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మధిర మండలం ఆత్కూర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు మీదుగా శుక్రవారం వెళ్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కారును అధికారులు తనిఖీ చేశారు. మంత్రి తుమ్మల ఏపీలోని విజయవాడకు మధిర మీదుగా వెళ్తున్నారు. ఈక్రమంలో ఆయన వాహనాన్ని అధికారులు తనిఖీ చేశాక బయలుదేరారు. తనిఖీల్లో మంత్రి వాహనంలో నగదు, విలువైన వస్తువులేమీ లభించలేదని, తనిఖీలకు మంత్రి పూర్తిగా సహకరించారని అధికారులు తెలిపారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అనుమతులు



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్, కేఎంసీ కమిషనర్

ఖమ్మం సహకారనగర్: టీఎస్ బీపాస్ విధానం ద్వారా నిర్మాణ అనుమతులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్ణీత సమయంలోగా జారీ చేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లే ఔట్ అప్రూవల్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 13 దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటిని ఆమోదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లే ఔట్ల అనుమతులను గడువులోగా నిబంధనల మేరకు జారీ చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, ఆర్డీఓ గణేష్, జెడ్పీ సీఈఓ వినోద్‌తో పాటు ప్రసాద్, వికాస్ పాల్గొన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

- నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తలు తప్పనిసరి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



నాయకన్‌గూడెం చెక్‌పోస్ట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఏఆర్ఓలు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశమైన ఆయన మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పత్రాల పరిశీలన, ఇతర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే, నామినేషన్ల స్క్రూటినీ సమయంలోనూ అన్ని జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఇక ఏఆర్ఓలు తమ పరిధిలోని వందశాతం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతుల కల్పనపై దృష్టి సారించాలనిచెప్పారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, సీపీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు జి.గణేష్, శ్రీనివాస్, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా

కూసుమంచి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద 24గంటల పాటు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాలతో పాటు నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారా అని ఆరా తీశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తూ వీడియో రికార్డు చేయాలని సూచించారు. ఆతర్వాత మండలంలోని నాయకన్‌గూడెం, ఈశ్వరమాధారం, రాజుపేట, పెరికసింగారం, జుజుల్‌రావుపేటల్లోని పాఠశాలల్లో ఏర్పాటుచేస్తున్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అలాగే, మండలంలోని జుజుల్‌రావుపేటలోని పల్లె దవాఖానాను సైతం కలెక్టర్ తనిఖీ చేసి వైద్యసేవలపై సూచనలు చేశారు. ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెరపైకి యాసంగి రైతుబంధు

ఐదెకరాల రైతులకు నగదు జమ అయ్యే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: మళ్లీ యాసంగి రైతుబంధు తెరపైకి వచ్చింది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతుబంధు ద్వారా నగదు జమ నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిధులు కేటాయించగా ఆటంకాలు ఎదురయ్యాయి. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తామని ప్రకటించింది. ఈమేరకు డిసెంబర్ 12న రైతుల అకౌంట్లలో నిధులు జమ చేయడం ప్రారంభించగా.. ఇప్పటివరకు నాలుగెకరాల భూమి కలిగిన రైతులకు నగదు అందింది. ప్రస్తుతం ఐదెకరాల భూమి కలిగిన వారి అకౌంట్లలో రైతుబంధు నగదు జమ చేస్తామని శుక్రవారం ప్రభుత్వం వెల్లడించడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో రైతుబంధుకు 3.42 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించగా, 2.81 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.210 కోట్లు జమ అయ్యాయి. ఐదెకరాల భూమి ఉన్న రైతులు 26 వేల మంది ఉండగా రూ.44 కోట్లకు పైగా అందనున్నాయి. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఆటంకాలు ఎదురవుతాయా, డిసెంబర్‌లోనే మొదలైనందున నగదు జమ చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

వైద్యం... దైవాధీనం



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

పెద్దాస్పత్రిలో అరకొరగా వైద్యసేవలు

- మెడికల్ కళాశాల ఏర్పాటయ్యాక దిగజారిన పరిస్థితులు
- జూనియర్లతోనే నెట్టుకొస్తున్న వైనం
- సరైన చికిత్స అందక ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని పెద్దాస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో అంతకు ముందుతో పోలిస్తే వైద్యసేవలు మెరుగవుతాయని అంతా భావించారు. కానీ ఖమ్మంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. సీనియర్ వైద్యులు లేక జూనియర్లతోనే నెట్టుకొస్తుండడంతో ఆస్పత్రి పరిస్థితి మేడిపండు చందంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. గత వైభవం లేకపోవడంతో చాలామంది వైద్యసేవలపై పెదవి విరుస్తుండగా.. మరికొందరు ఇతర ఆస్పతుల బాట పడుతున్నారు.

అంతా జూనియర్లే..

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 500 పడకల సామర్థ్యంతో ఉండగా.. జిల్లా నుంచే కాక భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి ప్రజలు ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. ప్రతీరోజు 1,500 వరకు వస్తుండగా, కొంత కాలంగా వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయని వాపోతున్నారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు తర్వాత ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లను కేటాయించారు. ఇందులో ఎక్కువ భాగం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి కేటాయించినా ఎక్కువ మంది చుట్టపు చూపుగా గంట, అరగంట వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జూనియర్ వైద్యులపై భారం వేస్తుండగా మెరుగైన వైద్యం అందడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. శిక్షణ కోసం వచ్చిన జూనియర్లు సీనియర్ల వద్ద నిత్యం చికిత్స విధానాలు నేర్చుకోవాల్సి ఉండగా.. వారే అంతా అయి వ్యవహరిస్తుండడంతో గతం మాదిరిగా వైద్య సేవలు అందడం లేదు.

మధ్యాహ్నం తర్వాత ఖాళీ..

వైద్యులు సమయపాలన పాటించకపోవడం వల్ల ప్రజల పాలిట శాపంగా మారుతోంది. సాధారణంగా ఓపీ ఉదయం 8నుండి సాయంత్రం 4గంటల వరకు కొనసాగాలి. కానీ మధ్యాహ్నం 12 గంటలు దాటాక ఒక్క వైద్యుడు ఓపీలో కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకంతో వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం ఓపీ చూపించుకుని పరీక్షలు చేయించుకుని వస్తే వైద్యులు లేక నిరాశే ఎదురవుతోంది. దీంతో మరుసటి రోజు వచ్చి పరీక్ష రిపోర్ట్‌లు చూపించాల్సి వస్తోంది. ఇంకొందరు రాలేక అనారోగ్యం పెరుగుతున్నా భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

పేరుకే 100 మంది వైద్యులు..

ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, ఆర్థో, పీడియాట్రిక్, గైనిక్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, కంటి, ట్రామా తదితర సేవల కోసం వివిధ షిఫ్టుల్లో 100 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలు 60 మంది వరకు ఉన్నారు. పీజీ పూర్తి చేసిన 20మంది సీనియర్ రెసిడెంట్లుగా పనిచేస్తున్నారు. అలాగే, ప్రస్తుతం పీజీ చేస్తున్న 40మంది డ్రిస్టిక్ట్ రూరల్ ప్రోగ్రామ్ కింద మూడు నెలల శిక్షణకు వచ్చారు. కానీ ప్రభుత్వ వైద్యులు విధుల్లో అలసత్వం వహిస్తుండడంతో సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలే భారమంతా మోస్తున్నారని తెలుస్తోంది.

మెడికల్ కళాశాలకు ముందే బాగుండే...

గత ఏడాది ప్రారంభంలో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అనుసంధానిస్తూ మెడికల్ కళాశాలకు అనుమతులు వచ్చాయి. అదే ఏడాది అక్టోబర్‌లో వంద మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించారు. అయితే కళాశాల ఏర్పడక ముందు పెద్దాస్పత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండడంతో సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లతో కళకళలాడేది. సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుతుండడంతో ప్రజలు బారులుదీరేవారు. కానీ కళాశాల ఏర్పాటు తర్వాత ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో వారిని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశాక ఆస్పత్రిలో మునపటి పరిస్థితులు కనిపించడం లేదు. కొందరు పర్మనెంట్ వైద్యులు ఇష్టానుసారంగా వచ్చి వెళ్తుండడంతో సేవలపై ప్రభావం పడుతుండగా... డీఆర్‌పీ, ఎస్ఆర్‌లతో అందే నామమాత్రపు వైద్యం ప్రజల ఆరోగ్యాన్ని బాగు చేయడం లేదు. దీనికి తోడు గతంలో మాదిరి పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలు జరగకపోగా.. ఐసీయూ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రస్తుతం కేవలం ప్రసవాలు మాత్రమే సక్రమంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. దీంతో చాలా మంది ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నందున ఉన్నతాధికారులు ఆస్పత్రి నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

క్లుప్తంగా

న్యాయ సేవా సంస్థ డిఫెన్స్ కౌన్సిల్‌లో ఉద్యోగావకాశాలు

ఖమం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కొనసాగుతున్న డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు అటెండర్ పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన నిర్ణీత కాలానికి నియమించనున్నట్లు పేర్కొన్నారు. నోటిఫికేషన్‌తో పాటు దరఖాస్తు నమూనా, ఇతర వివరాలను ఖమ్మం జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో పరిశీలించి ఆసక్తి ఉన్న వారు ఈనెల 26వ తేదీలోగా పోస్ట్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తులు పంపించాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓ ప్రతీక్ జైన్, అధికారులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకుల డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పించేందుకు విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ప్రవేశాల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. మణుగూరులోని బాలుర డిగ్రీ కళాశాలతో పాటు కొత్తగూడెం, దమ్మపేట, ఖమ్మం బాలికల కళాశాలల్లో చేరేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 28 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ తుమికి వెంకటేశ్వరరాజు, ఏఓ నరేందర్‌తో పాటు కృష్ణ, స్వప్న, రాజేశ్వరి, రోజా, మానస తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాయల



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులైన రాయల నాగేశ్వరరావు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను చైర్మన్‌గా నియమించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

లేఔట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



లే ఔట్‌ను పరిశీలిస్తున్న సత్యప్రసాద్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోనికాకర్లపల్లి రోడ్డు, గౌతమ్‌స్కూల్ రోడ్లలో ఉన్న లే ఔట్లను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. రోడ్లు, ఇతర సదుపాయాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవిబాబు, టీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా కోర్టు న్యాయమూర్తిగా శ్రీనయ్య

ఖమ్మం లీగల్: ఖమ్మం మహిళా కోర్టు న్యాయమూర్తిగా వి.శ్రీనయ్య నియమితులయ్యారు. ఈమేరకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

యువకుడు అదృశ్యం

నేలకొండపల్లి: మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో ఆయన కుటుంబీకులకు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని రాయగూడెంకు చెందిన కొండలు సూర్యాపేట జిల్లా కోదాడలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. రోజులాగే బుధవారం వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఎక్కడ ఆచూకీ తీసినా ఫలితం లేకపోగా, ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో ఆయన కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,075	6,100
కందులు	9,452	9,452
మిర్చి	20,200	12,000
మిర్చి తాలు	11,000	8,000
పత్తి	7,450	6,000

– ఖమ్మం వ్యవసాయం

ఎన్నేళ్లు ఔట్‌సోర్సింగ్ కష్టాలు?



సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెంలో నిర్వహించిన సభలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

- 2006 నుంచి విధులు నిర్వర్తిస్తున్నా అరకొరగానే వేతనాలు
- ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే చెల్లించాలని విన్నపాలు
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం, పీఆర్సీ కోసం డిమాండ్
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 12 వేల మందికి పైగా ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ విధానంపై విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలని.. తద్వారా ఉద్యోగ భద్రత కల్పించి తమ 18 ఏళ్ల కల నెరవేర్చాలని విన్నవిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల్లో 12 వేల మందికి పైగా ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు ఉండగా.. ప్రభుత్వ ఉద్యోగులతో పాటే సమాన పనికి సమాన వేతనం చెల్లించి పీఆర్సీ వర్తింపజేయాలని కోరుతున్నారు.

2006 నుంచి అమల్లో..

2006 నుంచి ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. తొలుత వారిని ఆఫీస్ సపోర్టింగ్ విధానంలో తీసుకోగా..రూ.4,900 నుంచి రూ.6,500 వరకు వేతనాలు చెల్లించారు. ఆ తర్వాత 2011లో కాస్త పెంచగా రూ.6,500 నుంచి రూ.8,400గా సవరించారు. ఇక తెలంగాణ ఏర్పడ్డాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా విభజించి రూ.12 వేలు, రూ.15 వేలు, రూ.17,500గా చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 12 వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. అయితే, వారికి అతి తక్కువ వేతనాలను ఏజెన్సీల ద్వారా చెల్లిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా వేతనాల విషయంలో చిన్నచూపు చూడటం సరికాదనే భావన వ్యక్తమవుతోంది. సమానంగా వేతనాలు చెల్లించడమే కాక పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర సెలవులను వర్తింపజేయాలని కోరుతున్నారు. ఇందులో చాలా వరకు అమలుచేసే అవకాశమున్నా ఏజెన్సీలు నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

ఎవరికీ పట్టని వెతలు

18 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా వేతనాలు అతితక్కువ స్థాయిలోనే పెరిగాయని చెబుతున్నారు. ఈ కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు పీఆర్సీ ఆధారంగా ఎన్నోరెట్లు పెరగగా.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకునే వారు మాత్రం కరువయ్యారు. వారి వేతనం కేవలం రూ.10 వేలు మాత్రమే పెరగగా.. పీఆర్సీలు, ఇంక్రిమెంట్ల ఊసే లేదు. ప్రతిసారి జీఓల ప్రకారం వేతనాలు వస్తాయని ఎదురుచూడడం.. ఏజెన్సీల బాధ్యులు కోతలు విధిస్తూ మిగతా వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక ఉద్యోగుల వేతనాల నుంచి మినహాయించుకున్న ఈపీఎఫ్‌లు, ఈఎస్ఐ కూడా సక్రమంగా చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక్కో ఉద్యోగి నుంచి దాదాపు రూ.4 వేల నుంచి రూ.5 వేల మేర ఏజెన్సీలు మినహాయించుకుంటున్నా ప్రభుత్వ సంస్థలకు చెల్లించకపోవడంతో ఆపద సమయంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

కమిటీ నివేదిక బుట్టదాఖలు

2020లో నియమించిన బిస్వాల్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉద్యోగుల వేతనం కేటగిరీల వారీగా రూ.19 వేలు, రూ.22,900, రూ.31,040గా పేర్కొన్నారు. అలాగే, ఒకే శాఖలో సమాన పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగుల వేతనంలో వ్యత్యాసం ఉండదాన్ని సుప్రీంకోర్టు శ్రమదోపిడీగా పేర్కొంది. ఇకనైనా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు విధినిర్వహణ ఆధారంగా మెరుగైన వేతనాలు చెల్లించాలని, ఇందు కోసం ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి అందరినీ పర్మనెంట్ చేయడంతో పాటు ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే వేతనం చెల్లించాలి



ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే మాకు వేతనాలను చెల్లించాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగికి రూ.10 లక్షలు చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

–పులి లక్ష్మయ్య, తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నందున వారితో సమానంగా వేతనాలు ఇవ్వడంతో పాటు పీఆర్సీ వర్తింపజేయాలి. తద్వారా మా కుటుంబాలకు భద్రత కల్పించాలి.

–దిలీప్‌కుమార్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్



ప్రతీ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసుకునేలా పర్యవేక్షిస్తాం. రెండేళ్లకోసారి పనితీరు ఆధారంగా మళ్లీ ఏజెన్సీలు రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలి. కాగా, ఏజెన్సీల బాధ్యులు జీఓల ప్రకారం ఉద్యోగులకు వేతనాలు అందజేస్తారు.

–ఎండీ షఫీయుద్దీన్, లేబర్ ఆఫీసర్, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాచలం పట్టణానికి గోదావరి వరద ముప్పు నుంచి పూర్తి స్థాయిలో రక్షణ లభించనుంది. ఇరవై ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కరకట్ట నిర్మాణ పనులు తిరిగి మొదలయ్యాయి. ఈ క్రమంలో కరకట్టను భక్తులకు మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

నీడ, గ్రీన్ ఎనర్జీ..

కరకట్టపై సోలార్ ప్యానెళ్ల రూఫ్‌టాప్‌కు అవకాశం

- అభివృద్ధి ప్రణాళికల్లో చేర్చాలని కోరుతున్న భక్తులు
- భద్రాచలంలో మళ్లీ మొదలైన గోదావరి కరకట్ట పనులు
- ఇరవై ఏళ్లుగా పెద్దగా మార్పునకు నోచుకోని వైనం



హైదరాబాద్‌లోని రింగురోడ్డు వెంట కొత్తగా నిర్మించిన సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్



భద్రాచలంలో గోదావరి వెంట కరకట్ట

మళ్లీ కరకట్ట పనులు

గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించేందుకు వీలుగా ఇరవై ఏళ్ల కిందట ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న యటపాక నుంచి భద్రాచలం మీదుగా గ్రామ సరిహద్దుల వరకు కరకట్ట నిర్మాణం మొదలెట్టారు. సుమారు 7.5 కిలోమీటర్ల మేర కరకట్టను గతంలోనే నిర్మించారు. ఇందులో గోదావరిపై నిర్మించిన వంతెన దగ్గర నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రాంతం మీదుగా సీడబ్ల్యూసీ ఫ్లడ్ మెజర్‌మెంట్ పాయింట్, స్నానఘట్టాలు, గోదావరి మాత విగ్రహం, గంగమ్మ తల్లి గుడి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు కరకట్టపై సిమెంట్ రోడ్డు నిర్మించారు. అక్కడక్కడ బెంచీలు వేశారు. కరకట్ట దిగువ భాగంలో రామాయణ ఇతివృత్తాన్ని తెలిపే విధంగా బాపు బొమ్మల ఆధారంగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత చెప్పుకోదగ్గ మార్పులేమీ లేవు. గత పుష్కరాల సందర్భంగా కొత్త స్నానఘట్టాలు, ఇటీవల వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మరో ఘాట్‌ను నిర్మిస్తున్నారు. తాజాగా ఇరవై ఏళ్ల కిందట అర్ధంతరంగా ఆగిపోయిన కరకట్ట పనులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కరకట్ట వెంబడి మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది.

సోలార్ సైక్లింగ్ ట్రాక్

గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా ఇటీవల హైదరాబాద్ నగరంలో రింగురోడ్డు వెంబడి 23 కిలోమీటర్ల మేరకు సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. దీని నిర్మాణానికి రూ.35 కోట్లను వెచ్చించగా, ట్రాక్ విద్యుదుత్పత్తి సామర్థ్యం 14 మెగావాట్లుగా ఉంది. ఈ ట్రాక్ నగరానికి మరింత గుర్తింపును తెచ్చింది. ఇదే తరహాలో గోదావరి కరకట్టపై భాగంలో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసే అంశాన్ని భద్రాచలం అభివృద్ధి ప్రతిపాదనల్లో చేర్చాలని భక్తులు కోరుతున్నారు. ఇక్కడ నుంచి వచ్చే సౌర విద్యుత్ ద్వారా ఆలయ ప్రాంగణాన్ని రాత్రి వేళలో విద్యుత్ దీపకాంతులతో అలంకరించే వీలు ఏర్పడుతుంది. ప్రస్తుతం ముక్కోటి, శ్రీరామనవమి, ఇతర పర్వదినాల్లో తప్పితే భద్రాచలం దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంలేదు. రాత్రి వేళలో ఆయలం చీకట్లోనే ఉండిపోతోంది. కరకట్ట వెంబడి సోలార్ ప్లేట్లను అమర్చితే గ్రీన్ ఎనర్జీని పొందడంతోపాటు కరకట్ట వెంబడి నడిచే భక్తులకు నీడను అందించినట్లు అవుతుంది.

నెట్‌జీరో సంస్థల సహకారం

జిల్లాలో అనేక పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. ఇందులో సింగరేణి సంస్థ నెట్‌జీరో సంస్థగా మారేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణతోపాటు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా సోలార్ విద్యుదుత్పత్తి చేసేందుకు గల అవకాశాలను పరిశీలిస్తోంది. భద్రాచలం కరకట్టపై కూడా సోలార్ రూఫ్ టాప్ నిర్మాణం చేసేందుకు అవకాశాలను పరిగణనలోకి తీసుకునేలా జిల్లా యంత్రాంగం, ఆలయ పాలకులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

సోలార్ ట్రాక్

రాష్ట్రంలోనే వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భద్రాచలం ఒకటి. ముఖ్యంగా శ్రీరామనవమి సమయంలో భద్రాచలంలో ఎండలు మండిపోతుంటాయి. గోదావరి తీరంలో పవిత్ర స్నానం చేసేందుకు వచ్చే భక్తులకు నిలువ నీడ ఉండని పరిస్థితి ఇప్పుడు నెలకొంది. భక్తులకు నీడను ఇవ్వడంతో పాటు గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసే విధంగా గోదావరి కరకట్టపై భాగంలో సిమెంటు రోడ్డుపై భాగంలో సోలార్ ప్యానెళ్లతో రూఫ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. గోదావరి వంతెన నుంచి సుభాష్‌నగర్ కాలనీ వరకు ఉన్న కరకట్టపై భాగంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుదుత్పత్తి చేయడంతోపాటు ఎండా వానల నుంచి భక్తులకు రక్షణ కల్పించినట్లు అవుతుంది.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకుడు వెంకటేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తూ.. ఈడీ, సీబీఐతో దాడులు చేయిస్తున్న కేంద్రప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్(మాస్‌లైన్), న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు సమావేశమయ్యారు. ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈడీ, సీబీఐ సంస్థల ద్వారా ప్రశ్నించే వారిపై బీజేపీ కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గమనించి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మహ్మద్ జావీద్, గోపాల్, మిక్కిలినేని నరేందర్, నల్లమోతు తిరుమలరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీవై.పుల్లయ్య, బచ్చలికూర రఘునాథ్, పొన్నం వెంకటేశ్వరరావు, వై.విక్రం, జితేందర్‌రెడ్డి, జలగేపల్లి రవి, ఎస్.కే.ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే...

ఖమ్మంమయూరిసెంటర్: ఎలక్టోరల్ బాండ్లపై ప్రజల దృష్టిని మరల్చేందుకే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని, ఇది ప్రధాని మోదీ ఎత్తుగడ అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ సంయుక్త కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీ ఫాసిస్టు శక్తులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

13 మంది ద్విచక్ర వాహనదారులపై కేసు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ, సిబ్బంది

ఖమ్మంక్రైం: నంబర్ ప్లేట్‌లో అక్షరాలను తొలగించిన 13 మంది ద్విచక్రవాహనదారులపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్రంలో పలువురు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్నారనే ఫిర్యాదుతో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకపోవడంతో పాటు ఉన్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడకుండా కొన్ని అక్షరాలను తొలగించిన వారిని గుర్తించామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ వివరించారు.

వేర్వేరు చోట్ల చైన్ స్నాచింగ్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో గంటల వ్యవధిలో శుక్రవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ ఘటనలు జరిగాయి. వివరాలిలా ఉన్నాయి. సారథినగర్‌కు చెందిన ఏపూరి పద్మ వాకింగ్ కోసం స్థానిక పార్క్‌కు వెళ్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కోబోయారు. దీంతో ఆమె అప్రమత్తం కావడంతో చేతికందిన గొలుసు ముక్క లాక్కుని పారిపోయారు. ఆమె సుమారు 28గ్రాముల గొలుసు పోయిందని ఫిర్యాదు చేసిందని ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ తెలిపారు. అలాగే, మామిళ్లగూడెంలో ఓ కిరాణం షాపునకు వచ్చిన ఇద్దరిలో ఒకరు బయట నిలబడగా, ఇంకో వ్యక్తి బిస్కెట్లు కావాలని అడిగి తీసుకుంటూ షాపులోని మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోయాడు. ఈఘటనలో ఆమె ఆరు తులాల గొలుసు పోయిందని ఫిర్యాదు చేయగా ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ విచారణ చేస్తున్నారు. రెండు చోరీలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పైనే రావడంతో ఒకే ముఠాగా భావించి సీసీ కెమెరాల పుటేజీ పరిశీలిస్తున్నారు.

ఆరుతడి పంటల సాగుతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమారెడ్డి

చింతకాని: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత ఆధారంగా రైతులు ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిలభారత సమన్వయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోవర్ధన్ సూచించారు. మండలంలోని రామకృష్ణాపురంలో శుక్రవారం ఆరుతడి పంటల సాగు, జీరో టిల్లేజ్ మొక్కజొన్న సాగుపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ పంటమార్పిడి విధానం, ఆరుతడి పంటల సాగు వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా సంస్థ సహాయ సంచాలకురాలు డాక్టర్ ఉమారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రగతి కుమారి, ఆర్‌ఈఏసీ సభ్యులు రాణా, ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, ఏఓ పల్లెల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

11 లీటర్ల నాటుసారా స్వాధీనం

తల్లాడ: తల్లాడ మండలం మల్సూర్‌తండా వద్ద ఎక్సైజ్ అధికారులు శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో 11 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కల్లూరు మండలం రాళ్లబంజరకు చెందిన కేలోత్ కృష్ణ, ధరావత్ రాము మోటార్‌సైకిల్‌పై సాటుసారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మమత తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు సాయిరాం, రతన్‌ప్రసాద్‌రెడ్డి, సీతారాం, రవి, నాగేశ్వర్‌రావు, శ్రావణ్ పాల్గొన్నారు.


కోడి పందేల స్థావరాలపై దాడులు



పట్టుపడిన వారితో ఎస్సై, సిబ్బంది

పెనుబల్లి: మండల కేంద్రం శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో వీఎం.బంజర్ ఎస్సై కె.వెంకటేష్ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పందేలు ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.4వేల నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారు కాగా గాలిస్తున్నట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

బస్సులో వస్తుండగా బంగారు ఆభరణాలు చోరీ



బాధితురాలు కమలమ్మ

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్ నుంచి బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఘటన వివరాలు బాధితురాలి కథనం ప్రకారం ఇలా.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం సిరిపురానికి చెందిన సెట్టి కమలమ్మ శుక్రవారం ఆర్టీసీ బస్సులో కోదాడ నుంచి ఖమ్మం బయలుదేరింది. ఆమె పక్కన మరో మహిళ కూర్చోగా టికెట్ తీసుకునే సమయాన ఆధార్‌కార్డు కోసం బ్యాగ్ తెరిచి ఏడు తులాల బంగారు చంద్రహారం, నల్లపూసల గొలుసు ఉన్న చిన్న పర్స్ చూసుకుంది. అయితే, నేలకొండపల్లిలో ఆమెతో కూర్చున్న మహిళ దిగాక అనుమానంతో పర్స్ చూసుకుంటే గొలుసులు కనిపించలేదు. దీంతో కమలమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా డ్రైవర్ బస్సుఆపి మొత్తం తనిఖీ చేసినా ఆభరణాలు లభించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఏడాదిగా విధులకు హాజరుకాకపోవడంతో చర్యలు

కారేపల్లి: కారేపల్లి బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పి.రామగోపిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ జయరాజు తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి విధులకు హాజరుకాకుండా, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పాఠశాలలో విద్యావలంటీర్‌ను ఏర్పాటుచేసినట్లు తేలడంతో చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ వీడి వెళ్లొద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

మధిర: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిన గుర్తుతెలియని యువకుడు (20) మృతి చెందాడు. మధిర స్టేషన్ సమీపాన డౌన్‌లైన్‌లో శుక్రవారం రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 58589 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

ఖమ్మంరూరల్: ప్రేమించిన యువతి దూరమవుతుందనే ఆవేదనతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని పల్లెగూడెంకు చెందిన బత్తిని నిఖిల్(22) అదే గ్రామంలో బైక్ మెకానిక్ షెడ్‌లో పనిచేస్తుండగా, ఓ యువతిని కొన్నాళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఆమె కొద్దిరోజులుగా నిఖిల్‌ను దూరం పెడుతుండడంతో తన ప్రేమను నిరాకరిస్తోందని భావించి వారం క్రితం పురుగుల మందు తాగాడు. ఆయనను హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందడంతో, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోలీ మామూళ్ల కోసం రహదారి దిగ్బంధం

వాహనం పైనుంచి పడడంతో మహిళకు తీవ్రగాయాలు

ఎర్రుపాలెం: హోలీ సందర్భంగా మామూళ్ల వసూలు కోసం రోడ్డుకు అడ్డుగా కట్టిన తాడు తట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళ కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని తెల్లపాలెం గ్రామానికి చెందిన అయిలూరి సామ్రాజ్యం తన మనవడితో కలిసి శుక్రవారం ద్విచక్రవాహనంపై ఎర్రుపాలెం మీదుగా ఖమ్మం వెళ్తోంది. ఈక్రమంలో జమలాపురం ఆర్చీ వద్ద హోలీ మామూళ్ల కోసం కొందరు మహిళలు రోడ్డుకు అడ్డుగా తాడు కట్టారు. దీంతో సామ్రాజ్యం మనవడు ద్విచక్ర వాహనాన్ని ఆపే క్రమంలో ఒక్కసారిగా బ్రేక్ వేయగా ఆమె కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వెంటనే మహిళలు అక్కడ నుండి ఉడాయించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఆమెను మధిర తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, మామూళ్ల పేరిట రహదారులపై వాహనదారులను వేధిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ మూడో జాబితా విడుదల

11 ఎమ్మెల్యే, 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను వెల్లడించిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మరో 11 అసెంబ్లీ స్థానాలు, 13 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు ఆ పార్టీ 139 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. పొత్తులో భాగంగా 144 స్థానాల్లో పోటీచేయాల్సి వుండగా ఇంకా ఐదు స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. అలాగే, పొత్తులో 8 ఎంపీ స్థానాలు వదులుకోవడంతో 17 స్థానాలకుగానూ 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన నాలుగు స్థానాలకు ఖరారు చేయాల్సి వుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివాదంగా మారిన పెనమలూరు, మైలవరం సీట్లకు బోడె ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్ పేర్లను ఖరారుచేశారు. మైలవరం సీటు కోసం ఫిరాయింపు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావులు గట్టిగా పోటీపడ్డారు. ఈ స్థానాన్ని నిలుపుకునేందుకు దేవినేని ఉమా గట్టిగా పట్టుబట్టినా ఇటీవలే టీడీపీలో చేరిన కృష్ణప్రసాద్ ధనబలంతో దాన్ని చేజిక్కించుకున్నట్లు చెబుతున్నారు. మైలవరం టికెట్‌ను ఫిరాయింపు నేతకు ఇస్తున్న నేపథ్యంలో పెనమలూరు సీటుకు దేవినేని ఉమా పేరును పరిగణలోకి తీసుకుని అక్కడికి పంపుతున్నట్లు హడావుడి చేశారు. అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్‌ను పక్కనపెడుతున్నట్లు హంగామా చేసినా చివరికి ఆయనకే సీటు ఇచ్చారు. దీనివెనుకా భారీగా డబ్బు దండుకునే వ్యూహం అమలైనట్లు తెలుస్తోంది

టీడీపీ ఎంపీ అభ్యర్థులు వీరే..	
శ్రీకాకుళం	రామ్మోహన్ నాయుడు
విశాఖపట్నం	మాత్కుమిల్లి భరత్
అమలాపురం	గంటి హరీష్ మాధుర్
ఏలూరు	పుట్టా మహేష్ యాదవ్
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)
గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్
నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయలు
బాపట్ల	తెన్నేటి కృష్ణప్రసాద్
నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
చిత్తూరు	దగ్గుమళ్ల ప్రసాదరావు
కర్నూలు	బస్తిపాటి నాగరాజు
నంద్యాల	బైరెడ్డి శబరి
హిందూపురం	బీకే పార్థసారథి
ఎమ్మెల్యే అభ్యర్థులు..	
పలాస	గౌతు శిరీష
పాతపట్నం	మామిడి గోవిందరావు
శ్రీకాకుళం	గొండు శంకర్
ఎస్.కోట	కోళ్ల లలితకుమారి
కాకినాడ సిటీ	వనమాడి వెంకటేశ్వరరావు
అమలాపురం	అయితాబత్తుల ఆనందరావు
పెనమలూరు	బోడె ప్రసాద్
మైలవరం	వసంత కృష్ణప్రసాద్
నరసరావుపేట	డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు
చీరాల	ఎం. మాలకొండయ్య యాదవ్
సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు..

సాక్షి, హైదరాబాద్: బాపట్ల ఎంపీ సీటును ఆశ్చర్యకరంగా తెలంగాణకు చెందిన బీజేపీ నేత, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌కి ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో టీడీపీ శ్రేణులే అవాక్కయ్యాయి. ఆయన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి కావడంతోపాటు పుట్టి పెరిగింది అంతా తెలంగాణలోనే. అలాంటి వ్యక్తికి చంద్రబాబు ఏపీలో సీటు ఇచ్చారు. బాపట్ల స్థానానికి అభ్యర్థి దొరక్క చంద్రబాబు చాలారోజులపాటు అన్వేషణ కొనసాగించారు. ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఇవ్వాలని చూసినా ఆయనకు చిత్తూరు సీటు ఇచ్చి ఆఖరి నిమిషంలో కృష్ణప్రసాద్‌కు బాపట్ల సీటు ఇచ్చారు. నిజానికి.. వరంగల్ ఎంపీ సీటు కోసం బీజేపీ తరఫున పోటీచేసేందుకు కృష్ణప్రసాద్ ప్రయత్నించి విఫలమయ్యారు. ఈయనకు చంద్రబాబు అనూహ్యంగా ఏపీలో సీటు ఇవ్వడం గమనార్హం.

'మత్తు' చుట్టూ చుట్టాలే

▶ మొదటి పేజీ తరువాయి

తెరతీసింది. తద్వారా డ్రగ్స్ దందా వెనుక తాము ఉన్నామనే విష యాన్ని కప్పిపుచ్చవచ్చని చంద్రబాబు భావించారు. అయితే కూనం కోటయ్య చౌదరితో టీడీపీ నేతల వ్యాపార బంధం వెలుగు చూడటంతో బాబు కుట్ర బెడిసికొట్టింది. చంద్రబాబు వదిన, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబంతో కూనం కుటుంబానికి ఉన్న వ్యాపార బంధం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. రాయపాటి, దామచర్ల, లావు కుటుంబ సభ్యు లతో కూనం కోటయ్య చౌదరి కలసి ఉన్న ఫొటో లు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూనం వీరభద్ర చౌదరితో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజాకు ఉన్న బంధాన్ని రుజు వు చేసే వ్యాపార లావాదేవీల పత్రాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో టీడీపీ, బీజేపీ పొత్తు కుదు రుతుందనే సంకేతాలు అందిన వెంటనే బ్రెజిల్ నుంచి భారీగా డ్రగ్స్ దిగుమతికి తెర తీసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడం గమనార్హం.

కింగ్ పిన్ కోటయ్య చౌదరి..

డ్రగ్స్ దందాలో కీలక పాత్రధారులైన సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు అత్యంత సన్నిహితులని ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. ఆయన సన్నిహితులు, వ్యాపార భాగస్వాముల జాబితాను చూస్తే ఆ విషయం తేలిపోతోంది. దామచర్ల సత్యం (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్థన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి)లకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారంతా ఓ కోటరీగా పెద్ద ఎత్తున వ్యవహారాలు సాగించారన్నది వెల్లడైంది. వారు విదేశాల్లో అత్యంత సన్నిహితంగా తిరిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దామచర్ల సత్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబుతోనూ సాన్నిహిత్యం ఉంది. సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరితోపాటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత ఆలపాటి రాజాకు వ్యాపార బంధం ఉంది. వారిద్దరూ సంతకాలు చేసిన పలు పత్రాలు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విశాఖ కేంద్రంగా వ్యవహారాలు సాగిస్తున్న సంధ్యా ఆక్వా కంపెనీకి నందమూరి కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. బాలకృష్ణ చిన్నల్లుడు, లోకేశ్ తోడల్లుడు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.భరత్‌కు కూనం కోటయ్య చౌదరి అత్యంత సన్నిహితుడు. ఆయన కుటుంబం సహకారంతోనే విశాఖ కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. సంధ్యా ఆక్వా కంపెనీతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వ్యాపార బంధం ఉందన్నది ఇప్పటికే బయటపడింది. పురందేశ్వరి కుమారుడు చెంచురామ్, వియ్యంకుడు భాగస్వాములుగా కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరి ఆక్వా వ్యాపారాన్ని ప్రారంభించారు. దీంతో డ్రగ్స్ దందాలో తీగ లాగితే చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి కోటరీ అక్రమాల డొంకంతా కదులుతోంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ..

దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పాత్ర ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడిన సిండికేట్‌లో ఆ కంపెనీ కూడా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఆ కేసును కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు విశాఖ డ్రగ్స్ దందాను కూడా కలిపి మొత్తంగా మద్యం, డ్రగ్స్ మాఫియా గుట్టును ఛేదించే పనిలో నిమగ్నమైంది.

పొత్తుతోనే బరితెగింపు..

ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఎప్పుడో సిద్ధపడ్డారు. అందుకోసం కాళ్ల బేరానికి కూడా దిగజారతానని గతేడాదే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పొత్తును అవకాశంగా చేసుకుని భారీగా డ్రగ్స్ దందాకు పచ్చ మాఫియా బరితెగించింది. ఎన్నికల ముందు భారీగా డ్రగ్స్‌ను రాష్ట్రంలోకి తరలించేందుకు పథకం వేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే సంధ్యా ఆక్వా కంపెనీ ద్వారా బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల ఈస్ట్ దిగుమతి ముసుగులో భారీగా డ్రగ్స్‌ను చేరవేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రెండు నెలల్లో డ్రగ్స్ విశాఖ చేరుకునేలా అంతా సిద్ధమైంది. అటు దగ్గుబాటి ఇటు చంద్రబాబు కుటుంబాలు సహకారం ఉండటంతో తమ దందాకు అడ్డు ఉండదని భావించారు. డ్రగ్స్ మాఫియాపై అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటర్‌పోల్‌కు ఉప్పందడంతో ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయాన్ని అప్రమత్తం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారుల బృందం విశాఖ పోర్టులో నిర్వహించిన తనిఖీల్లో డ్రగ్స్ బాగోతం బట్టబయలైంది. పచ్చ కుట్ర బెడిసికొట్టింది.

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ తక్షణమే ప్రతి స్పందించింది. డ్రగ్స్ దందాతో నారా, నందమూరి, దగ్గుబాటి కుటుంబాలకు ఉన్న బంధాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నియమావళిని ఉల్లంఘిస్తూ చంద్రబాబు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆధారాలతో నివేదించింది. దీనిపై జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. డ్రగ్స్ దందాపై సత్వరం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీబీఐని కోరింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి పాత్రధారులతోపాటు సూత్రధారులను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేసింది.

కూనం కుటుంబం కథ...

విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన పాత్రధారులైన సంధ్యా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ అధినేతలు కూనం వీరభద్ర చౌదరి, కుమారుడు కూనం కోటయ్య చౌదరి స్వగ్రామం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి. ఆక్వా రంగంలో ఉత్థాన పతనాలను చూసిన వీరభద్ర చౌదరి డ్రగ్స్ వ్యాపారంలో కాలు మోపాడు. కాకినాడ ప్రధాన కేంద్రంగా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్ల ముసుగులో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అటు టీడీపీ ఇటు రాష్ట్ర బీజేపీ అగ్రనేతల అండదండలతో తన కార్యకలాపాలను విస్తరించాడు. కూనం కుటుంబానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సంధ్యా ఆక్వా ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్లతో పాటు ఆక్వా కల్చర్ చెరువులు కూడా ఉన్నాయి. వీరి వ్యాపార లావాదేవీలు కొండపి, ఒంగోలు, కందుకూరు, పర్చూరు నియోజకవర్గాల్లోనూ సాగుతున్నాయి. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోదరుడు దామచర్ల సత్యనారాయణ(సత్య)తో కూనం కుటుంబానికి వ్యాపార లావాదేవీలున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో దామచర్ల సత్యకు చెందిన పొగాకు గోడౌన్‌లో సంధ్యా ఆక్వా పేరుతో ప్రీ ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటైంది. కూనం కుటుంబానికి విజయవాడకు చెందిన సౌమ్యుడిగా పేరున్న ఓ టీడీపీ నేతతోనూ సంబంధాలున్నట్లు సమాచారం. కోటయ్య చౌదరి, టీడీపీ నేత తనయుడు తనయుడు విదేశాల్లో మంచి సన్నిహితులని తెలిసింది.

చీరాలకు లింకు?

డ్రగ్స్ దందాకు చీరాలతో కూడా లింకులు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. సంధ్యా ఆక్వా పేరుతో వాడరేవులో గత రెండేళ్లుగా కంపెనీ నడుస్తోంది. దీన్ని పురందేశ్వరి అల్లుడు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. గత పది రోజులుగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం.

కాకినాడ తీరంలో కలకలం

డ్రగ్స్ తీగ లాగితే కాకినాడ జిల్లా కొత్తపల్లి తీరంలోని మూలపేటలో డొంక కదిలింది. మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 10 మంది సీబీఐ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో సోదాలు జరిపారు. సీబీఐ ఇన్‌స్పెక్టర్ బల్వీందర్ సింగ్ ఆధ్వర్యంలో సీబీఐ బృందం ఈ తనిఖీలు చేసింది. జిల్లాలోని శంఖవరం మండలం కత్తిపూడి సమీపాన ఉన్న సంధ్య ఆక్వా సీడ్ తయారీ కంపెనీ, కృష్ణా జిల్లా పామర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న సంధ్య ఆక్వా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్నారు. కత్తిపూడి సమీపంలోని సంధ్య ఆక్వా సీడ్ కంపెనీని ఇటీవలే ప్రారంభించారు. దీనిలో ఆక్వా సీడ్ తయారీకి అవసరమైన ముడి సరుకును బ్రెజిల్ నుంచి దిగుమతి చేయడంతో ఆ సరకు నౌక ద్వారా విశాఖకు కంటైనర్లలో చేరింది. వాటిలో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించిన సీబీఐ అధికారులు సంధ్య కంపెనీలన్నింటిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించి మందులు, ఇతర శాంపిల్స్ సేకరించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించిన సీబీఐ అధికారులు తిరిగి సోదాలు చేస్తామని తెలిపారు.

మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్ పరీక్ష

డ్రగ్స్ కేసులో సీబీఐ దూకుడు పెంచింది. శుక్రవారం మరికొన్ని శాంపిల్స్‌ను పరీక్షించగా ఫలితాలు పాజిటివ్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో న్యాయమూర్తి సమక్షంలో 25 వేల కేజీల సరుకుతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశారు. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి రవాణా నౌక ద్వారా విశాఖకు వచ్చిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 19, 20వ తేదీల్లో 49 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించగా డ్రగ్స్ ఉన్నట్లు నిర్ధారణైంది. దీంతో ఈ నెల 21వ తేదీన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం మరోసారి వీసీటీపీఎల్‌కు వెళ్లి మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించారు. వాటి ఫలితాలు కూడా పాజిటివ్‌గా వచ్చినట్లు సమాచారం. న్యాయమూర్తి సమక్షంలో రికార్డులతో పాటు శాంపిల్స్‌ను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తి సమక్షంలోనే బ్యాగులను సీజ్ చేశారు. మరికొన్ని సీబీఐ బృందాలు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలోమరిన్ని ఆధారాలతో సీబీఐ అధికారులు త్వరలోనే అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆలపాటి ఆర్థిక బంధం

విశాఖ డ్రగ్స్ కేసులో కీలక పాత్రధారి కూనం వీరభద్ర చౌదరితో మాజీ మంత్రి ఆలపాటి రాజాకు ఉన్న ఆర్థిక సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. ఆలపాటి రుణాలకు కూనం సెక్యూరిటీ ఇవ్వడంతోపాటు ఎన్ఆర్ఐ అకాడమీతో భాగం పంపిణీ చేసుకోవడం వంటి వ్యవహారాలు చోటు చేసుకున్నాయి. 2015 అక్టోబరు 31న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు అరండల్‌పేట విజయా బ్యాంకు బ్రాంచ్‌లో రూ.2 కోట్లు రుణం (దస్తావేజు నంబరు 11158/2015) తీసుకున్నారు. అదే ఏడాది డిసెంబరు 9న మరో రూ.12 కోట్లు అదే బ్యాంకు నుంచి రుణాన్ని పొందారు. దీనికి ఆలపాటి రాజా భార్య ఆలపాటి మాధవితోపాటు కూనం వీరభద్రరావు, ఎన్ఆర్ఐ అకాడమీ ఆస్తులను (దస్తావేజు నంబరు 12521/2015) తనఖా పెట్టారు. 2021లో కూనం వీరభద్రరావుకు ఎన్నారై అకాడమికి సంబంధించి పార్టీషన్ దస్తావేజు కూడా నమోదైనట్లు తెలుస్తోంది. కూనం వీరభద్రరావు తమ ఆస్తులను తనఖా పెట్టి 2017లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రుణాన్ని ఇప్పించారు (దస్తావేజు నంబరు 4581/2017). ఇదే దస్తావేజును 2021లో (నంబరు 12205/2021) రద్దు చేసుకున్నారు. దీంతోపాటు మరికొన్ని ఆర్థిక లావాదేవీలు కూడా వీరిద్దరి మధ్య జరిగినట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

ఆల్ ఇండియా పోలీస్ టోర్నీలో ఏఎస్పీ సత్తా



పతకం అందుకుంటున్న వెంకట్రావు

ఖమ్మంస్పోర్ట్స్: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ నెల 17 నుంచి 23 వరకు జరిగిన ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నీలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు, అడిషనల్ ఎస్పీ జి.వెంకట్రావు సత్తాచాటారు. ఆయన 55 ఏళ్ల వయస్సు కేటగిరీ సింగిల్స్‌లో తృతీయ స్థానంలో నిలవగా.. డబుల్స్‌లో వరంగల్ ఏసీపీ జితేందర్‌రెడ్డితో కలిసి కాంస్య పతకం దక్కించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న వెంకట్రావును బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు, క్రీడాకారులు అభినందించారు.

పర్ణశాలలో వేలం ఖరారు

దుమ్ముగూడెం: మండలంలోని పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో వాహన పార్కింగ్, బోట్ షికారు, మరుగుదొడ్ల వేలం పాటలను గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ముత్యాలరావు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. పార్కింగ్ వేలంలో ఏడుగురు పాల్గొనగా పాడియం వెంకటరత్నం రూ.40 లక్షలకు దక్కించుకున్నారు. బోటు షికారు వేలంలో ఐదుగురు పాల్గొనగా నవలం భద్రయ్య రూ.42.40 లక్షలకు, మరుగుదొడ్ల వేలాన్ని వాగే రాజేశ్వరి రూ.1.05 లక్షలకు దక్కించుకున్నారు. ఎస్ఐ కేశవరావు ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేయగా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లోపభూయిష్టంగా నోటిఫికేషన్లు

- సింగరేణిలో ఎక్స్‌టర్నల్ పోస్టుల సంఖ్య పెంచాలని వినతులు
- దివ్యాంగులను విస్మరించొద్దని విజ్ఞప్తి
- వయోపరిమితిని పెంచకపోవడంపై నిరుద్యోగుల పెదవి విరుపు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ఇటీవల ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ విషయమై నిరుద్యోగులు హర్షిస్తున్నా.. పోస్టుల సంఖ్యను చూసి మాత్రం పెదవి విరుస్తున్నారు. ఏదైనా ప్రభుత్వ రంగ సంస్థలో తొలుత ఇంటర్నల్ అభ్యర్థుల నుంచి 33 శాతం ఉద్యోగాలు భర్తీ చేశాక మిగిలిన 66 శాతం ఖాళీలను ఎక్స్‌టర్నల్ అభ్యర్థులతో భర్తీ చేయాలని సుప్రీంకోర్టు గతంలో వెల్లడించిన తీర్పులు చెబుతున్నాయి. అయితే, వాటిని విస్మరించి ఇంటర్నల్ 986 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా.. రెండు విడతల్లో 605 పోస్టులతో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సంస్థలో సుమారు 39 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా, వారిలో 13 వేల మంది డిపెండెంట్ ఉద్యోగులు ఉన్నారు. వారికి జేబీసీసీఐ నిబంధనల ఆధారంగా వేతనాలు చెల్లిస్తూ, సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్ఎల్‌సీ) కల్పిస్తారు. కాగా, విద్యార్హతలు, వృత్తి నైపుణ్యం, ఇతర అంశాల ఆధారంగా పరీక్షలు నిర్వహించి పదోన్నతులు కల్పించడం సబబే అయినా ఇదంతా సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ఆధారంగా చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ మేరకు ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో 66 శాతం పోస్టులు ప్రకటిస్తే నిరుద్యోగులకు మేలు చేసినట్లవుతుందని పలువురు కోరుతున్నారు.

కేడర్ల వారీగా అన్యాయం

సింగరేణి విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో లేని కొన్ని కేడర్ పోస్టులు ఇంటర్నల్ నోటిఫికేషన్‌లో ఉండటంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే భావన వ్యక్తమవుతోంది. ప్రధానంగా జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఆఫీసర్స్(ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్) బయోకెమిస్ట్రీ, జూనియర్ శానిటరీ ఆఫీసర్స్, వెల్డర్ పోస్టులకు అసలే నోటిఫికేషన్ ఇవ్వలేదని వాపోతున్నారు. అంతేకాకుండా ఇంటర్నల్ నోటిఫికేషన్‌లో ఫిట్టర్ 123 పోస్టులు, ఎలక్ట్రీషియన్ పోస్టులు 133 ఇచ్చిన యాజమాన్యం ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో ఫిట్టర్ 44, ఎలక్ట్రీషియన్ 98 పోస్టులతోనే సరిపెట్టుకుంది. ఇంటర్నల్ నోటిఫికేషన్ ప్రకారం 400కు పైగానే జూనియర్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ పోస్టులు ప్రకటించాల్సి ఉందని చెబుతున్నారు.

వయోపరిమితి పెంచాలి



టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లలో వయోపరిమితి 44 ఏళ్లు ఉండగా, సింగరేణి మాత్రం 35 ఏళ్లుగా నిర్ణయించడంతో నిరుద్యోగులు అర్హత కోల్పోతున్నారు. యాజమాన్యం ఏటా నోటిఫికేషన్లు విడుదల చేయని కారణంగా వయోపరిమితి పెంచితే అర్హులకు న్యాయం జరుగుతుంది.

–కోట శివశంకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

దివ్యాంగుల పోస్టులు వెల్లడించాలి



సింగరేణి నోటిఫికేషన్లలో దివ్యాంగులకు ఏయే పోస్టులు కేటాయించారో స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వ రంగ సంస్థలో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని 2016లో జీఓ విడుదలైంది. ఈ విషయాన్ని గుర్తించి దివ్యాంగులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల్లో న్యాయం చేయాలి.

–గుండపనేని సతీశ్, టీవీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు

సమస్యల పరిష్కారానికి సహకరిస్తా

ఎమ్మెల్సీ తాతా మధు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

ఖమ్మంసహకారనగర్: ఇతర దేశాల్లో చదువుకుంటున్న జిల్లా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తానా మాజీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెల్లడించారు. ఖమ్మంలో శుక్రవారం జరిగిన ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్‌కార్డ్ కోసం పోటీ పెరిగిన నేపథ్యాన ఇప్పుడు విదేశాలకు వెళ్తున్న వారికి ఉద్యోగాలు లభించటం కష్టంగా మారిందన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు వారికి మనోధైర్యం కల్పించాలని సూచించారు. అనంతరం ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా యార్లగడ్డ హన్మంతరావు, గౌరవ అధ్యక్షురాలిగా బత్తినేని నీరజ, ఉపాధ్యక్షులుగా వై.శ్రీనివాసరావు, పారుపల్లి ఝాన్సీ, కోశాధికారిగా సామినేని నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా రాయల రవి, కట్టా రాములమ్మ, చెరుకూరి నిర్మల తదితరులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మేదరమెట్ల స్వరూపారాణి, దుగ్గి లక్ష్మి, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



ఆపరేటర్‌కు లోడర్ తాళం అందజేస్తున్న డైరెక్టర్, వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

మణుగూరుటౌన్: శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే లక్ష్యసాధన సాధ్యమవుతుందని సింగరేణి డైరెక్టర్ (పీ అండ్ పీ) వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో 6.4 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన అత్యాధునిక వీల్‌లోడర్‌ను ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. లోడర్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ వార్షిక లక్ష్యమైన 119.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఓసీ–4 లో కంటిన్యూస్ మైనర్ ద్వారా బొగ్గు ఉత్పత్తిని పరిశీలించిన ఆయన కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, నాయకులు వై.రాంగోపాల్, కృష్ణంరాజు, అధికారులు రాంబాబు, వీరభద్రుడు, రమణారెడ్డి, లింగబాబు, షబ్బీరుద్దీన్, చిట్టా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి అన్నపురెడ్డిపల్లి బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు
- 25న స్వామి తిరు కల్యాణమహోత్సవం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం

(ఇన్‌సెట్) ఆలయంలో స్వామి వారి మూలవిరాట్

అన్నపురెడ్డిపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లిలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి గురువారం వరకు బ్రహ్మోత్సవాలు జరగనుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులు హాజరుకానున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించగా.. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయం, కల్యాణ మండపం వద్ద క్యూలైన్లు ఏర్పాటుచేసి తాగునీటి వసతి కల్పించినట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు.

చారిత్రక నేపథ్యం

శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. కాకతీయుల సామ్రాజ్యంలో సేనానిగా పనిచేసిన అన్నపురెడ్డి ఇక్కడకు వచ్చినప్పుడు ప్రశాంత వాతావరణాన్ని చూసి స్వామిని ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఆలయంలో కైంకర్యాల నిమిత్తం గ్రామంలో రాయుడు చెరువు, నల్లచెరువును తవ్వించడమే కాక కొంత భూమి దానం ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ సేనాని పేరుతోనే గ్రామానికి అన్నపురెడ్డిపల్లి అనే పేరు రాగా.. ఇక్కడ కొలువుదీరిన స్వామి సంతాన బాలాజీగా పేరుగాంచారు. ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న కాళ్లూరి వంశస్తుడు శ్రీవెంకటప్పయ్యామాత్యుడు సంతానం కోసం స్వామిని పూజించగా నలుగురు పిల్లలు జనిస్మించడంతో కాళ్లూరి వంశస్తులు 1870వ సంవత్సరంలో ఆలయాన్ని పునర్నిర్మించినట్లు కాళ్లూరి జోగారావు రచించిన 'రాజధర్మ ప్రకాశిక'పుస్తకం ద్వారా తెలుస్తోంది. ఇక 1969 నుంచి ఆలయాన్ని దేవాదాయ శాఖ పర్యవేక్షిస్తోంది. అనంతరం 1974 లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సహకారంతో రూ.18 లక్షలు వెచ్చించి మహామండపం, ప్రాకార మండపం, నలుదిక్కులా అతి పెద్ద గోపురాలతో నిర్మాణం చేపట్టారు. కాగా, స్వామి వారికి రాష్ట్రంలోని ఏ ఆలయానికి లేనట్లుగా 2,300 ఎకరాల భూమి ఉండడం విశేషం. ఏటా బ్రహ్మోత్సవాల్లో సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందజేస్తారు. దీన్ని స్వీకరించిన దంపతులకు సంతానం కలుగుతుందని నమ్మిక.

బ్రహ్మోత్సవాలు ఇలా..

అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజైన శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు, అంకురార్పణ, ఆదివారం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, గరుడ ప్రసాదం పంపిణీ ఉంటుంది. ఇక సోమవారం గజవాహన సేవ, పల్లకీసేవ, ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 10 గంటలకు స్వామి వారి తిరుకల్యాణం నిర్వహిస్తారు. మంగళవారం రథోత్సవం, దొంగల దీపోత్సవం, బుధవారం ఊంజల్ సేవ, దీపోత్సవం, 10న చక్రస్నానం తదితర పూజలు ఉంటాయి. కాగా, బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సత్తుపల్లి, కొత్తగూడెం డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపిస్తారు.

ముగిసిన జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడా పోటీలు

టెన్నిస్ చాంపియన్‌గా కేటీపీఎస్ 7వ దశ జట్టు

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కళా భారతి క్రీడామైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడాపోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా వాలీబాల్‌లో కేటీపీపీ జట్టు ప్రథమ స్థానం దక్కించుకోగా, కేటీపీఎస్ 5, 6 దశలు, కేటీపీఎస్ 7వ దశ, బీటీపీఎస్ ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఇక టెన్నిస్ టీం ఈవెంట్‌లో కేటీపీఎస్ 7వ దశ ప్రథమ స్థానంలో నిలవగా, కేటీపీఎస్ 5, 6 దశలు, కేటీపీపీ, బీటీపీఎస్ ఆ తర్వాత స్థానాలు దక్కించుకున్నాయి. డబుల్స్‌లో వై.వెంకటేశ్వర్లు, ఎండీ ఆరిఫ్ (కేటీపీపీ 7వ దశ), కె.సతీశ్, జి.వెంకటేశ్వర్లు (కేటీపీఎస్ 5, 6) ఎస్కే సోందు, సీహెచ్ అయోధ్య (వైటీపీఎస్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు టెన్నిస్‌లో కేటీపీఎస్ 7వ దశ జట్టు చాంపియన్‌గా నిలవగా, విజేతలకు చీఫ్ ఇంజనీర్లు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, కె.శ్రీనివాసబాబు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, క్రీడా కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, కె.నరసింహారావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న సీఈలు